# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు.

- ❖ భారత సాయుధ దళాలు ప్రపంచంలోనే అత్యంత క్రమశిక్షణ, ధైర్య సాహసాలు కలిగినవని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.

- ❖ అనారోగ్య బాధితులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

- ❖ అంగన్వాడీ సిబ్బందికి కూటమి ప్రభుత్వంలో గౌరవం, ఆర్థిక భద్రత పెరిగిందని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు పలువురు కేంద్ర మంత్రులను కలిసి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిపారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ తో సమావేశమైన ఆయన దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ క్లస్టర్, ఫిషింగ్ హార్బర్లకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఈ ప్రాజెక్టు కోసం 3 వేల 488 ఎకరాల భూమి సమకూర్చేందుకు అంగీకారం తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన టెక్నో–ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ (TEFR) సిద్ధమైందని పేర్కొన్నారు. చిప్ టు షిప్ విజన్‌కు అనుగుణంగా షిప్ బిల్డింగ్ రంగాన్ని బలోపేతం చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ముఖ్యమంత్రి.. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో సమావేశమయ్యారు. విశాఖ - విజయవాడ మెట్రో రైలు ఏర్పాటు ఆవశ్యకతను కేంద్రమంత్రికి వివరించి, మెట్రో రైలు ప్రాజెక్టులను ఆమోదించాలని కోరారు. సవరించిన డీపీఆర్ లను కేంద్రప్రభుత్వ ఆమోదానికి పంపినట్టు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి.. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురిని కలిసి.. నెల్లూరు జిల్లాలో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈ ప్రాజెక్టు 96 వేల 862 కోట్ల రూపాయల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద సమగ్ర ఇంధన ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని కేంద్రమంత్రికి చంద్రబాబు నాయుడు వివరించారు.

====================

భారత సాయుధ దళాలు ప్రపంచంలోనే అత్యంత క్రమశిక్షణ, ధైర్య సాహసాలు కలిగిన దళాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. లోక్ భవన్ లో ఈరోజు జరిగిన సాయుధ దళాల జెండా దినోత్సవం కార్యక్రమానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. మన సైనికుల ధైర్యం, త్యాగం సాటిలేనివని, అత్యంత కఠిన వాతావరణ పరిస్థితుల్లో కూడా దేశ రక్షణ కోసం అప్రమత్తంగా ఉంటారని కొనియాడారు. యుద్ధ సమయాల్లోనే కాక.. దేశంలో భూకంపాలు, వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ గొప్ప సేవలందిస్తారని పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

అనంతరం... మాజీ సైనికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై రూపొందించిన `మన మార్గదర్శి` పుస్తకాన్ని హోం మంత్రి.. గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి ఆవిష్కరించారు.

====================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనారోగ్య బాధితులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో పార్టీ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. 13 మంది లబ్ధిదారులకు 14 లక్షల 92 వేల రూపాయలకు పైగా మొత్తాన్ని మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అండగా ఉండాలనే సీఎం రిలీఫ్ ఫండ్ ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు.

విరామం

====================

ఏసు క్రీస్తు త్యాగం, ప్రేమ, కరుణ, బోధనల ద్వారా మానవాళికి చక్కని శాంతిమార్గం చూపారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు మంత్రి ప్రత్యేక అతిథిగా హాజరయి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమానికి 150 కోట్ల రూపాయలు అదనంగా కేటాయించామని చెప్పారు. గతంతో పోలిస్తే.. అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవం, ఆర్థిక భద్రత పెరిగిందని అన్నారు. గ్రామీణ నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందజేయాలని అంగన్వాడీలకు మంత్రి సూచించారు. అనంతరం మంత్రి నియోజకవర్గంలోని 319 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ మొబైల్స్ అందజేశారు.

====================

సాయుధ దళాల పతాక నిధికి రాష్ట్రంలోనే అత్యధికంగా నిధులు సేకరించినందుకు గాను గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. గుంటూరు జిల్లా నుండి 17 లక్షల 67 వేల రూపాయలకు పైగా సాయుధ దళాల పతాక నిధి సేకరణ జరిగి, ప్రథమ స్థానంలో నిలిచింది. లోక్ భవన్ లో ఈరోజు జరిగిన కార్యక్రమంలో గవర్నర్.. జిల్లా కలెక్టర్ కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తమీమ్ అన్సారియా మాట్లాడుతూ... సైనికులు వారి ప్రాణాలు పణంగా పెట్టి మనల్ని కాపాడుతున్నారన్నారు. ప్రజలంతా ప్రశాంతంగా జీవిస్తున్నారంటే అందుకు సైనికుల త్యాగాలే కారణమని పేర్కొన్నారు.

====================

ఏజెన్సీ ప్రాంతంలో తయారైన వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ తెలిపారు. రంపచోడవరం మండలం సూర్లవాడ గ్రామంలో గిరిజనులు తయారు చేసిన వెదురు

వస్తువులకు సంబంధించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలోని గిరిజనులు తయారు చేసిన వెదురు వస్తువులు మైదాన ప్రాంతంలో వెలుగు ప్రాజెక్ట్ ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గిరిజనులకు ఈ వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తామన్నారు.

====================

విశాఖపట్టణం వేదికగా ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజయవాడకు చెందిన అంచిత, దినేష్, దిరాజ్, తనూజ, తన్మయిలు పతకాలు సాధించారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ఈరోజు వీరిని అభినందించారు. క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దిన కోచ్ లు మహమ్మద్ ఖాజా, నాగుల్ మీరలను ప్రశంసించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించేలా ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

====================

ఐదు మ్యాచ్ ల టీ-20 సిరీస్ లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య చివరి టీ-20 క్రికెట్ మ్యాచ్ ఈ సాయంత్రం జరగనుంది. గుజరాత్ అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేధికగా రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. సిరీస్‌లో 2-1 తేడాతో భారత్ ముందంజలో ఉంది.

====================

ఈ నెల 21న జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ జీవనరాణి అధికారులకు విజ్ఞప్తి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమం ప్రచార పోస్టర్‌ను ఆమె ఈరోజు విడుదల చేసి, అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని చెప్పారు.

====================
====================